సికింద్రాబాదు-రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ పూనా స్టేషన్లో కొచ్చి ఆగింది. ఫస్టు క్లాసులో కూచున్న మోహన్ కిటికీ తలుపు తెరిచి మంచినీళ్ళ కుళాయి ఎక్కడుందోనని ప్లాట్‌ఫారం మీద కలియ చూడసాగాడు. కాస్తంత దూరంలో కుళాయి కనిపించటంతో వాటర్ బాటిల్నీ, ధర్మాస్ ఫ్లాస్కునీ తీసుకెనివెళ్ళి నీళ్ళు నింపు కుని ఫ్లాస్కులో టీ పోయించుకున్నాడు. తిరిగొచ్చి చూస్తే ఏముంది? తన సీట్లో మరెవరో స్త్రీ కూర్చొని ఉంది.

"సారీ! మీరు నా సీట్లో కూర్చున్నారండీ" అని అతనంటే ఆమె రవ్వంత పక్కకు జరిగి కూచుందే గాని లేవలా. ఈమె తన సీట్ని రిజర్వు చేయించుకోలేదా? అన్న అనుమానమతనికొచ్చింది గాని ఆ మాటే ఆమె నడగలేకపొయ్యాడు. సరే! ఆ కాస్త స్థలంలోనే సర్దుకు కూచున్నాడు.

రైలు కూత వేసి కదిలి, వేగం పుంజుకుంది. ఎప్పుడొచ్చాడో గాని టికెట్ కలెక్టరొచ్చి టిక్కెట్టు చెక్ చేస్తుంటే ఎదుటి సీట్లోని వ్యక్తి మరో కూపీలోకి వెళ్ళిపోయాడు. ఈమె వెళ్ళి ఆ సీట్లో కూచుంది. కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఇత నామెను చూస్తూ "అందగత్తే' నని అనుకున్నాడు. కొంత సేపయిన తర్వాత ఏమీ తోచలేదేమో ఎయిర్‌బ్యాగ్‌లోంచి ఓ పుస్తకం తీసి చదవటం మొదలుపెట్టాడు.

ఎర్రగా, ఎత్తుగాదృఢంగా ఉండే మోహన్ ధనవంతుడు. ఎదుటి వాళ్ళ నిట్టే ఆకర్షించే వ్యక్తిత్వమతనిది. వ్యాపారంలో నేర్పరి. వ్యవహారంలో దిట్ట. పుస్తకాల్ని తెగ చదివేస్తుంటాడతను. స్వయంగా అతనొక రచయిత. రాసినవి కొన్ని కథలే అయినా అవే అతనికి పేరు తెచ్చి పెట్టాయి. యవ్వనం దాటి రెండడుగులు ముందుకు వేసినా అతనిలో రసికత్వ మింకా వుంది!

ఎదురుగా కూచ్చున్నామె ఇంకా ఒగురుస్తోంది. ఆమె మొహం మీదంతా చిరుచెమట. బాగా అలసి పోయినట్లుంది. మోహన్ తన వాటర్ బాటిల్ని తీసి ఆమె కందించాడు. ఆమె దాన్నందుకుని ఓ రెండు కప్పుల నీళ్ళు తాగి దాన్ని మళ్ళీ అతని కిచ్చేసింది. ఆమె "థ్యాంక్స్' చెబితే అతను 'ఇట్సాల్ రైట్' అని దాన్ని కొంకికి తగిలించాడు. ఆమె గుజరాతీ అమ్మాయే అవొచ్చని అనుకొని-

"ఈ రోజు ఎండబాగానే ఉంది కదాండీ?' అని హిందీలో అంటే, ఆమె - "నలభై రెండు డిగ్రీలు. అయినా మనకే రోజు కారోజు ఎండ ఎక్కువే ఉన్నట్లని పిస్తుంది లెండి" అని స్వచ్ఛమైన తెలుగులో అంది.

"హమ్మయ్య. ఈవిడకు తెలుగొచ్చన్న మాట" అనుకొని.

"నిజమే లెండి" అని మళ్ళీ చదవటం మొదలెట్టాడు. కాని తనేం చదువుతున్నదీ అర్థంకావటం లేదతనికి. తన ఎదురుగా ఒక అమ్మాయుందనీ, ఆమె అందంగా ఉందని మాత్రమే అర్థమవుతోంది. ఆడ వాళ్లని చూడటం అసభ్యతని అతనికి తెలును. అయినా చూడకుండా ఉండలేక పోతున్నాడతను. ఆమెనొకటి రెండు సార్లు చూశాడు. చదువు సంస్కారం ఉన్న వ్యక్తి లానే ఉందనుకున్నాడు. ఉన్నట్లుండి ఆమె -

"ఏం పుస్తకమండీ అది. అంత దీక్షగా చదువుతున్నారు?" అనడిగింది.

"నేను రాసిన కథల సంపుటి" అని ఆ పుస్తకాన్ని ఆమె కందించాడు. దాని చివర అట్టమీద అతని ఫోటో ఉంది. అతని గురించిన నాలుగు వాక్యాలున్నాయి. ఆ పుస్తకంలోని కథల విశిష్టత గురించి, అతని ఇతర రచనల గురించీ ఉంది. ఇవన్నీ ఆమె చదివి-




"కథా రచయిత మోహన్ కుమార్ గారంటే మీరేనా! మీ కథలు చాలా వరకు నేనిదివరకు చదివేశ్లెండి! మిమ్మల్ని మాత్రం ఇంతవరకు చూళ్ళేదు. ఇప్పుడు మిమ్మల్నిలా కలుసుకోవడం నిజంగా నా అదృష్టమే. మీ కథలంటే నాకెంతో ఇష్టం. చాలా బాగుంటాయవి. "అని మళ్ళీ" ఇది మీ మొదటి పుస్తక మాండి? "అనడిగింది.

"కాదండీ రెండోది". దీనిదే మరో ఎడిషన్ వేస్తామంటే అన్ని కథల్నీ మరోసారి చదువుతున్నా"

" నా కయితే వీట్ని మళ్ళీ మరోసారి చదవాలనుంది. ఈసారి మామూలుగా కాక విమర్శనాత్మకంగా చదవాలి. మీ దగ్గర మరో కాపీ ఉందాండి?" అంది కుతూహలంగా ప్రదర్శిస్తూ.

"ఉందండి. దీన్ని మీ దగ్గర రుంచండి అంటూ ఠక్కున అందించాడు. రచనల్ని చదువుతానని అడిగే పాఠకులున్నారంటే ఆ రచయితకెంత ఆనందమో మీకేం తెలును?" అనంటూ తను మరో పుస్తకం తీసి చదవటం మొదలెట్టాడు. చదువుతూ ఆమెను మళ్ళీ ఒకసారి చూశాడు.

ఆమె ఇదేమి పట్టించుకోకుండా అతనిచ్చిన పుస్తకాన్ని చదవటంలో లీనమైపోయింది. సూరత్ స్టేషన్ రాబోతుంటే అతనా పుస్తకాన్ని మూసేశాడు. ఫ్లాస్కులోని టీ ఇద్దరికీ పోశాడు. టీ తాగుతూ ఆమె-

"మీ కథలు నిజంగా బాగున్నాయండీ. ఎన్నిసార్లు చదివినా మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తున్నాయవి. మన జీవితాలకెంత దగ్గరగా ఉన్నాయో! వీటిల్లోని పాత్రల కెంత ఆదర్శం! ఎంత నిజాయితీ. వీటిని చదివి నేటి యువతీ యువకులెంతో నేర్చుకోవలసిందుంది" అంది.

ఆమె మాటల్ని వింటూన్న అతనికి అమితానందంగా వుంది. తన కథల గురించి ఆమె అలా చెప్పుకుపోతూనే ఉండాలనుంది. అయినా పైకి మాత్రం మామూలుగా కనిపిస్తూ ఆమె చెప్పిందే వింటున్నాడు.

"నేనింతకు ముందు మీ గురించి ఏమూహించానో తెలుసాండీ ?"

"తెలీదండీ. చెప్పండి ఏ మూహించారో?" అనన్నాడు.

"గంభీరంగా వుంటూ, గుంభనగా నవ్వుతూ జీవితానుభవాల్నే కథల్లా రాసేనవయువకులని"

అతనొకసారి నవ్వి "భలే వారే. మరిప్పుడేమనుకుంటున్నారూ?"

"చిలిపిగా చూస్తూ కొంటెగా నవ్వుతూ మీ కథల్లోని కథానాయకుల్లా ఆదర్శంగా జీవించే వయోవృద్ధులు"

ఆమెమాటల్ని విని తెలుగు తెలిసిన ఓ గుజరాతీ అమ్మాయి తన వ్యక్తిత్వాని కొలత వేస్తున్నట్టనిపించింది అతనికి.

"వయోవృ....?" అని అతడు నసుగుతుండగానే ఆమె నవ్వి -

"కాదు లెండి విమర్శలకి మీరెలా రియాక్టవుతారో చూద్దామని

అలా అన్నా నంతే" అంది. ఆమె నవ్విన ఆ నవ్వులో అతనికప్పుడు తియ్యని, కమ్మని సంగీతమే వినిపించింది. అతనూ నవ్వాడు. నవ్వి

"మీ మాటలు వింటూంటేనాకేమనిపిస్తోందో తెలుసాండీ?"

"ఏమనిపిస్తోంది?" అనడిగింది.

"చెప్పటం కన్నా వినటంలోనే ఎక్కువ ఆనందముందని"

"అవునూ. ఇందులో కొత్తేముందీ? ఈ సత్యం మీకిది వరకే తెలీదా?"

అని మళ్లీ తెలతెలవారుతుండగా పక్షులు చేసే కలకలారావంలోని సంగీతాన్నిమీరెప్పుడూ విన్లేదా? విని తన్మయులైపోలేదా? కోకిల కంఠస్వరంలోని మాధుర్యంలో మిమ్మల్ని మీరెప్పుడూ మరిచిపోలేదా?" ఆమె ఇలా చెప్పుకుపోతూనే ఉంది అతనేమో

